సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



మందులోడా..ఓరి మాయలోడా..!

ప్రభుత్వ అనుమతులు లేకుండా మందులు, సర్జికల్ పరికరాలు విక్రయిస్తున్నవారిపై అధికార యంత్రాంగం నిఘాపెట్టింది. ప్రజల ఫిర్యాదులు మేరకు దాడిచేసి పట్టుకుంటోంది. - 8లో



కొట్టుకుపోయిన కాజ్‌వే

రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు బొబ్బిలి మండలం పారాది గ్రామం వద్ద నిర్మించిన తాత్కాలిక కాజ్‌వే వరదనీటిలో కొట్టుకుపోయింది. - 8లో



ఇసుక సరఫరాలో ఇబ్బంది కల్పించవద్దు - 8లో

ఉచిత ఇసుక సరఫరాలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా లారీ యాజమానులు చూడాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు.

న్యూస్‌రీల్

'మల్లి' పాఠశాలను సందర్శించిన పీఓ



విద్యార్థులు ఉంటున్న భవనాలను పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మండలంలోని 'మల్లి' గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి(ఎఫ్ఏసీ) సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అక్కడ చదువుతున్న భామిని ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులను నూతన భవనాలు పూర్తయిన వెంటనే తరలిస్తామన్నారు. అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రిన్సిపాల్ వాసుదేవరావుకు సూచించారు.

ఘనంగా అన్న సమారాధన



సంగంవలసలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం: మండలంలోని సంగంవలస, చినబొండపల్లి, గంగాపురం, ములగ, ఎమ్మార్ నగరం, పుట్టూరు, తదితర గ్రామాల్లో వినాయక చవితి త్రిరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయా గ్రామాల్లోని వినాయక మంటపాల వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు, పెద్దలు సామూహికంగా పాల్గొన్నారు. అన్న సమారాధనకు అన్ని వర్గాల వారు హాజరై స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నిమ్మలపాడులో ఏనుగుల గుంపు



నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర, నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు సోమవారం ఉదయం దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పామాయిల్ తోటలో ఉండి గుమ్మడిగెడ్డ వాగులోకి జారుకున్నాయి. సాయంత్రం నిమ్మలపాడు నుంచి కొమరాడ మండలంలోని పాత దుగ్గి పరిసర ప్రాంతాలలోకి చొచ్చుకు వచ్చాయి. చీకటి పడిన సమయంలో మళ్లీ గ్రామంలోకి వస్తాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవీ సిబ్బంది వాటిని తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

వరద బాధితులకు చెక్కు అందజేత



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న వైద్యులు

పార్వతీపురం: విజయవాడలోని వరద బాధితులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాళ్ల వివేక్, కార్యదర్శి జి.వాసుదేవరావులతో పాటు పలువురు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు రూ.1.25లక్షల విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వాగ్దేవి, డాక్టర్ వైపీ పద్మజ, డాక్టర్ ప్రతిమాదేవి, డాక్టర్ హేమంత్‌కుమార్, డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.4,70,486

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీల నుంచి రూ.4,70,486ల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ ఏడాది మే 27 నుంచి సెప్టెంబర్ 9 వరకు భక్తులు సమర్పించిన కానుకలను దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి నేతృత్వంలో సోమవారం లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, వీఆర్వో సలీమ, తదితరులు పాల్గొన్నారు.

వరదలో కాసుల వేట

- బుడమేరు వరద బాధితులకు సాయం పేరుతో బాదుడు
- డ్వాక్రా మహిళల దగ్గర రూ.10 నుంచి రూ.500 వరకూ వసూలు
- సీఎం సహాయనిధికి జమ చేయాలంటూ టీడీపీ నాయకుల చేతికి సొమ్ము
- విజయనగరం జిల్లా డ్వాక్రా సంఘాల సమాఖ్య రూ.10 లక్షల చెక్కు అందజేత
- పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.500 చొప్పున వసూలుకు ముమ్మర ప్రయత్నాలు



- సభ్యులెవ్వరి సమ్మతి తీసుకోకుండానే విజయనగరం జిల్లా స్వయంసహాయక సంఘాల (డ్వాక్రా) సమాఖ్య తరఫున కార్యదర్శి కె.వెంకట సత్యవతి తదితరులు రూ.10 లక్షల చెక్కును ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. కేవలం రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మెప్పు కోసమో మరెందుకో కారణం తెలియదుకానీ ఈ చొరవ తీసుకున్నారు. దీనిపై పలు సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు.
- బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాలు, బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని డ్వాక్రా సభ్యుల నుంచి తలో రూ.10 చొప్పున వసూళ్లు చేశారు. ఇలా రూ.1,37,440 వసూలుచేసి బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కే రంగారావు (బేబీ నాయన)కు తాజాగా అందజేశారు. బలవంతంగా వసూలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
- సాలూరులో డ్వాక్రా మహిళల తరఫున ఇప్పటికే రూ.10 చొప్పున వారికి తెలియకుండానే బదిలీచేసేశారు. ప్రతి నెలా చెల్లించాల్సిన పొదుపు డబ్బులతో పాటు రూ.10 కలిపి చెల్లించాలని గ్రూపు లీడర్లు సభ్యులకు చెబుతున్నారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

సంక్షోభాల నుంచి అవకాశాలను, ప్రకృతి విపత్తుల సమయంలో విరాళాలను అందిపుచ్చుకోవడంలో తమకు తిరుగులేదని మరోసారి టీడీపీ నాయకులు నిరూపిస్తున్నారు. బుడమేరు వరద బాధితులను ఆదుకోవాలనే సాకుతో సామాన్య డ్వాక్రా మహిళలపై భారం మోపుతున్నారు. పైసా పైసా పొదుపు చేసుకునేవారి నుంచి రూ.10 నుంచి రూ.500 వరకూ ఎంత వస్తే అంత వీలైనంత త్వరగా వసూళ్లు చేయాలనే లక్ష్యంతో టీడీపీ నాయకులు అధికారుల సహకారంతో ముందుకుపోతున్నారు. ఇదే అదనుగా పార్వతీపురం మన్యం జిల్లాలో తలో రూ.500 చొప్పున విరాళం ఇవ్వాల్సిందేనంటూ డ్వాక్రా సభ్యులకు ఇప్పటికే తేల్చిచెప్పినట్లు తెలిసింది. విజయనగరం జిల్లా స్వయంసహాయక సంఘాల (డ్వాక్రా) సమాఖ్య తరఫున రూ.10 లక్షల చెక్ ఇచ్చేశారు. ఆ మొత్తాన్ని సభ్యుల నుంచే రాబట్టే పనిలో కొంతమంది తలమునకలై ఉన్నట్లు తెలిసింది.



ఇవేం వసూళ్లో నాయనా...

విజయవాడలో బుడమేరు వరద బాధితులకు ఆర్థిక సాయం ముసుగులో ఇప్పటికే పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల నుంచి భారీగా విరాళాలను సేకరించారు. చివరకు అతి సామాన్యమైన డ్వాక్రా మహిళల వరకూ ఈ వసూళ్ల పర్వం వచ్చేసింది. విజయనగరం జిల్లాలో సుమారు 40,300 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 4.50 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వారిలో ఒక్కొక్కరి నుంచి రూ.10 నుంచి రూ.500 వరకూ వీలైనంత ఎక్కువ మొత్తాన్ని కచ్చితంగా వసూలు చేయాలని లక్ష్యం విధించారని తెలిసింది. కనీసం రూ.10 చొప్పున వసూలు చేసినా రూ.45 లక్షలు వసూలవుతుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏదిఏమైనా ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున వసూలు చేయాలనే కొంతమంది అధికార పార్టీ నాయకులు రంగంలోకి దిగినట్లు తెలిసింది. వారి ఆదేశాలను గ్రూపు లీడర్లు ఇప్పటికే సభ్యులకు చేరవేశారట. ఇది అనధికారికంగా ఇచ్చిన ఆదేశాలు కావడంతో ఏంచేయాలో తెలియక ఆర్పీలు, వీఐవోలు తలలు పట్టుకుంటున్నారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి విపత్తు సాయం అడగాల్సింది పోయి డ్వాక్రా మహిళల వద్ద విరాళాల వసూళ్లేమిటని డ్వాక్రా గ్రూపుల్లో చర్చలు జరుగుతున్నాయి. ఏదిఏమైనా పార్వతీపురం మన్యం జిల్లాలోని 16,667 డ్వాక్రా సంఘాల్లో 1,88,080 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కొక్కరి వద్ద నుండి రూ.500 వసూలైతే ఈ ఒక్క జిల్లా నుంచే రూ.9.40 కోట్లు సీఎం సహాయనిధికి జమ అవుతుందన్న మాట.

ప్రజల మాట...

- 'మా దగ్గరే వర్షాలతో అల్లాడుతుంటే ఇతర ప్రాంతాల ముంపు బాధితులకు మా వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడమేంట'ని బొబ్బిలి మండలంలోని అలజంగికి చెందిన ఓ డ్వాక్రా సభ్యురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- 'విజయవాడ వరద బాధితులకు విరాళాల నిమిత్తం ఆర్పీలు సమావేశానికి రమ్మన్నారు. స్వయం సహాయ సంఘాల వద్ద నుంచి విరాళాలు వసూలు చేయడం సరికాదు. విరాళం అంటే మాకు తోచినంత ఇస్తాం అంతేగాని రూ. 500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు' అని పార్వతీపురంలోని ఓ డ్వాక్రా సభ్యురాలు ప్రశ్నిస్తున్నారు.
- 'టీడీపీ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి. వరద బాధితుల కోసం విపత్తు నిధులు తెచ్చుకోవాలి. అంతేకాని మా దగ్గర రూ.500 చొప్పున వసూలు చేస్తే ఎలా? ఈ నిర్ణయంపై ఒకసారి పునరాలోచిస్తే మంచిది' అని పార్వతీపురానికే చెందిన దీప్తి అనే డ్వాక్రా సభ్యురాలు సలహా ఇస్తున్నారు.

బాధితులకు అండగా
వైఎస్సార్‌సీపీ



బంగారునాయుడుకు చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల/పూసపాటిరేగ: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎస్సెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో గుర్ల మండలంలోని చిన్న నాగళ్లవలసకు చెందిన చందక బంగారునాయుడు గాయపడగా, పూసపాటిరేగ మండలం గొల్లపేటకు చెందిన బమ్మిడి ఆనందరావు మృతిచెందారు. గాయపడిన బాధితునికి వైఎస్సార్‌సీపీ తరఫున రూ.లక్ష, మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం వేర్వేరుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందువరుసలో ఉంటారన్నారు. ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాలో గుర్ల జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు,పార్టీ నాయకులు పి.సన్యాసినాయుడు, జె.స్వామినాయుడు, బి.బంగారునాయుడు, టి.తిరుపతిరావు, కె.మధుసూదనరావు, ఎ.చిన్నారావు, ఎ.రామకృష్ణ, అప్పలరాజు, మహంతి శ్రీనివాసరావు, జనార్ధనరావు, పి.లక్ష్మీనారాయణ, బి.రమేష్, ఎ.రామకృష్ణ, జి.సురేష్‌రెడ్డి, టి.సీతారాం, జి.సూరప్పన్నరెడ్డి, కె.శ్రీరాములు, సత్తిబాబు, వి.అప్పన్న, ఎం.శ్రీనివాసరావు, ఎల్.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తరఫున రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు, పార్టీ నాయకులు

విద్యార్థుల ఇంటిబాట

- తరగతి గదులు కారుతుండడంతో ఇబ్బందులు

సీతంపేట: మండలంలోని 'మల్లి' గిరిజన గురుకుల సంక్షేమ బాలుర ఆశ్రమపాఠశాలలో నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు ఉండే గదులు వర్షాలకు కారుతుండడంతో వారంతా ఇంటిబాట పడుతున్నారు. భామిని మండల ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో తాత్కాలికంగా మల్లిలోని పాఠశాలలో 6,9 తరగతులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి బోధన సాగిస్తున్నారు. మొత్తం 112 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు ఉండే గదులు కారిపోతుండడంతో అవస్థలు పడుతున్నారు. చివరకు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్తున్నారు. ఇప్పటికే కొంతమంది విద్యార్థులు వెళ్లిపోయారు. ఐటీడీఏ పీఓ(ఎఫ్ఏసీ) యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ ఈఓ నారాయుడుతో పాటు పీఎంఆర్‌సీ సిబ్బంది పాఠశాలను సోమవారం సందర్శించారు. గురుకులం ప్రిన్సిపాల్ వాసుదేవరావుతో మాట్లాడి తరగతి గదుల విషయమై చర్చించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు ఉండడానికి వీలుగా ప్రత్యేకంగా మంచి గదులు కేటాయిస్తామని వారిని ఇక్కడే ఉంచాలని కోరారు. ఎవరైతే ఇళ్లకు విద్యార్థులను తీసుకువెళ్లారో వారిని వెంటనే పాఠశాలకు తీసుకురావాలని చెప్పారు.



ఇళ్లకు పిల్లలను తీసుకువెళ్తున్న తల్లిదండ్రులు

హమ్మయ్య..!

- తెరిపిచ్చిన వాన
- నిలకడగా నీటి ప్రవాహాలు
- ఊపిరిపీల్చుకున్న ప్రజలు, అధికార యంత్రాంగం

సాక్షి, పార్వతీపురం మన్యం: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో రెండు, మూడు రోజులుగా ఏకధాటిగా కురిసిన వాన తెరిపిచ్చింది. దీంతో నదీపరీవాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు.. మరోవైపు వాయుగుండం ప్రభావం జిల్లాపై పెద్దగా లేకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. వర్షాలకు పలు మండలాల్లో వరి పంట చేల్లో నీరు చేరింది. అరటి, పత్తి పంటలకు కాస్త నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో పంచాయతీరాజ్ రహదారులు దెబ్బతిన్నాయి. వివిధ పాజెక్టులు, నదుల్లో నీటి ప్రవాహం నిలకడగా ఉందని అధికారులు చెబుతున్నారు. మంగళవారం కూడా మోస్తరు వాన కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

జలాశయాల్లో నీటి పరిస్థితి

జలాశయం	నీటిమట్టం (మీటర్లలో)	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	అవుట్‌ఫ్లో
తోటపల్లి	105.00	103.90	2040	2041
జంఝావతి	124.65	122.64	460	460
పెదంకలాం	80.40	80.40	500	500
వట్టిగెడ్డ	121.62	118.41	239	25
పెద్దగెడ్డ	213.80	213.32	300	300
వెంగళరాయసాగర్	161.00	160.31	300	300

ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలో 27.1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మండలాల వారీగా వర్షపాతం

మండలం	కురిసిన వర్షం (మి.మీ.లో)
వీరఘట్టం	37.8
సీతంపేట	43.2
భామిని	79.6
పాలకొండ	37.0
కొమరాడ	19.6
గుమ్మలక్ష్మీపురం	21.6
కురుపాం	19.8
జియ్యమ్మవలస	32.2
గరుగుబిల్లి	14.8
పార్వతీపురం	37.4
మక్కువ	5.2
సీతానగరం	19.8
బలిజిపేట	20.6
సాలూరు	10.8
పాచిపెంట	6.8

పెరిగిన తోటపల్లి నీటిప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టువద్ద పరిస్థితి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టుకు నీటిప్రవాహం మరింత పెరిగింది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద ఆదివారానికి 2,160 క్యూసెక్కులు ఉన్న నీటి ప్రవాహం సోమవారం సాయంత్రానికి 3,710 క్యూసెక్కులకు చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేసి 2,777 క్యూసెక్కుల వరద నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువల ద్వారా 190 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రస్తుతం నదిలో సాధారణ నీటిమట్టం105 మీటర్ల లెవెల్‌కుగాను 103.93 మీటర్ల లెవెల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకుగాను 1.858 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టువద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నదికి వరద రావడంతో దిగువ భాగంలో ఉన్న నది ఒడ్డు ప్రాంతాలు కోతకు గురవుతున్నాయి.

గుమ్మగెడ్డ జలాశయానికి గండి



గండిపడిన గుమ్మగెడ్డ జలాశయం

సీతంపేట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సీతంపేట మండలంలోని గొయిది సమీపంలో ఉన్న గుమ్మగెడ్డ జలాశయానికి గండి ఏర్పడింది. దీంతో దిగువన ఉన్న పొలాలు ముంపు బారిన పడ్డాయి. గొయిది, రసూల్‌పేట తదితర గ్రామాలకు చెందిన రైతులు ఈ జలాశయంపై ఆధారపడి సాగు చేస్తున్నారు. జలాశయానికి గండిపడడంతో ఆరుగాలం శ్రమించి పండించిన ఖరీఫ్ వరి పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గండి పూడ్చివేసే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన



జంఝావతి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

కొమరాడ: జిల్లాలో భారీగా వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు జారీ అయిన నేపథ్యంలో జంఝావతి రిజ్వాయర్ వద్ద నీటి ప్రవాహం, ప్రస్తుతం నీటి స్థాయిలను కలెక్టర్ ఎ.శ్యామప్రసాద్ పరిశీలించారు. ఈ మేరకు సోమవారం ఆయన కొమరాడ మండలంలో పర్యటించిన క్రమంలో జంఝావతి, లాబేసు-పూర్ణపాడు వంతెన నిర్మాణం, కళ్లికోట వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా పలు అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జంఝావతి రిజ్వాయర్‌కు సంబంధించిన వివరాలు ఇంజినీర్లను అడగ్గా ఒడిశా అంతర్రాష్ట్ర అంశాల కారణంగా ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతోందని. ఇంజినీర్లు కలెక్టర్‌కు వివరించారు. అలాగే రివర్ గ్యాప్ వద్ద రబ్బర్ డ్యాం అమర్చినట్లు తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని రబ్బర్ డ్యాం డ్యామేజ్ కాకుండా ముందు జాగ్రత్తగా మూసివేసినట్లు తెలిపారు. వాతావరణం సాధారణ పరిస్థితికి వచ్చిన వెంటనే రబ్బర్ డ్యామ్ నుంచి కాలువల ద్వారా సాగునీరు అందిస్తామని అధికారులు వెల్లడించారు. జంఝావతి నది సుమారు నాలుగు కిలోమీటర్ల మేరకు ప్రవహించి నాగావళి నదిలో కలుస్తుందని చెప్పారు. అలాగే స్పిల్‌వే పనుల పూర్తి. తదితర అంశాల గురించి అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.

'లాబేసు- పూర్ణపాడు వంతెన పరిశీలన

మండలంలోని లాబేసు -పూర్ణపాడు వంతెన పరిస్థితిని కలెక్టర్ ఎ.శ్యామప్రసాద్ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం జరిగిన పనుల గురించి ఇంజినీరింగ్ అధికారులను ఆరా తీశారు. వంతెన పనుల్లో భాగంగా మొత్తం 12 శ్లాబ్‌లకు గాను ఏడు శ్లాబ్‌లు పూర్తయ్యాయని ఇంజినీర్లు కలెక్టర్‌కు తెలిపారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ ఇరువైపులా గ్రామాల ప్రజల రాకపోకలు సాగేలా వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వర్షాకాలం వల్ల పనులు నిర్వహించేందుకు వీలు కాలేదని తెలిపారు.

అలాగే గ్రామాల్లో హై రిస్క్ గర్భిణులు ఎవరైనా ఉన్నారా? అని ఆరాతీశారు. జ్వరాలు ప్రబలకుండా పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం కళ్లికోట ఇసుక రీచ్‌ను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.హేమలత, జంఝావతి కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్.జగదీశ్వర రావు, తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పూర్ణపాడులో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

క్లుప్తంగా

కారుణ్య నియామక పత్రాల అందజేత



నిర్మలకు కారుణ్య నియామకపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: అయినాడ మండల పరిషత్ పాఠశాలలో గ్రేడ్2 ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, అకాలమరణం పొందిన ఎం.నాగేశ్వర రావు భార్య నిర్మలకు కారుణ్యని యామక పత్రాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాస రావు సోమవారం తన చాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం పీఆర్‌ఐ సబ్‌డివిజన్ కార్యాలయంలో సహాయకురాలిగా నియమిస్తూ ఆమెకు ఈ నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయం సీసీ సురేష్ తదితరులు ఉన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



గాత్రకచేరీ నిర్వహిస్తున్న సంగీత, నృత్యకళాశాల విద్యార్థులు

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కళాశాల విద్యార్థులు నిర్వహించిన గాత్రకచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. గాత్ర కచేరీలో విద్యార్థులు దేవి, నీలిమ, మనీష దివ్య, తులసి, పవన్‌రాజు, మోహన్ కుమార్, సురేష్ కుమార్, సాయిగాయత్రి, జస్మిత, లాస్యవీణ, ప్రవల్లికలు అద్భుతంగా గానాలాపన చేశారు. వెంకటరావు మృదంగంపై సహకరించగా, సహాయ అధ్యాపకురాలు దేవీసుజాత నిర్వహణ బాధ్యత చేపట్టారు. అనంతరం నిర్వహించిన వయోలిన్ కచేరీలో ఆముదాలవలసకు చెందిన సత్యనారాయణ శర్మ, శాక్సాఫోన్‌పై మన్మథరావు, మృదంగంపై సూర్యప్రసాదరావులు సహకరించారు.

నలుగురు గంజాయి నిందితుల అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొండపల్లి: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. విజయనగరంలోని చెల్లూరుకు చెందిన కె.ఫణీంద్ర పట్నాయక్‌తో పాటు అల్లు సాగర్, టి.తేజ స్వరూప్, ఒడిశాలోని మునిగుడకు చెందిన సరోజ్ పటేల్‌లు అనుమానాస్పదంగా గొట్లాం రైల్వేస్టేషన్ వద్ద సంచరిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్సై యు.మహేష్ సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. అనంతరం వారిని తనిఖీ చేసి వారి దగ్గరున్న రెండున్నర కేజీల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు, ఆరు వేల నగదు, సరోజ్ పటేల్ వద్ద కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో గజపతినగరం సీఐ ఏవీ రమణ, ఎస్సై యు.మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ ఔదార్యం

- ఇల్లు కోల్పోయిన బాధితునికి రూ.లక్ష ఆర్థిక సాయం
- యువతను అభినందించిన పెద్దలు



శ్రీను కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేసిన యువగణేష్‌సేవా సంఘం సభ్యులు

మెరకముడిదాం: ఇల్లు కోల్పోయిన బాధితుడికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేసి గొప్పమనసును చాటుకున్నారు గర్భాం గ్రామానికి చెందిన యువగణేష్‌సేవా సంఘం సభ్యులు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన తాల్లాభక్తుల శ్రీనుకు చెందిన మిద్దిల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. శ్రీను కుటుంబ సభ్యులు నిరాశ్రయులుగా మిగిలారు. వీరి దీనస్థితిని చూసి సంఘ సభ్యులు చలించిపోయారు. గణపతి ఉత్సవాల్లో భాగంగా పౌరాణిక నాటికను ప్రదర్శించేందుకు పోగుచేసిన రూ.లక్షను ఇల్లు నిర్మించుకునేందుకు సాయంగా శ్రీనుకు సోమవారం అందజేశారు. వారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలపగా, గ్రామపెద్దలు అభినందించారు.

- లైసెన్స్ లేకుండా షాపుల్లో మందుల విక్రయం
- కేసులు నమోదు చేసిన ఔషధ నియంత్రణ శాఖ
- జిల్లాలో 1200 మందుల షాపులు
- ఏడాదిలో1012 మందుల దుకాణాల తనిఖీ
- నిబంధనలు అతిక్రమించిన 237 మందికి నోటీసులు
- కోర్టులో ఐదు కేసులు



మందుల షాపు

మందులోడా.. ఓరి మాయలోడా..!

విజయనగరం ఫోర్ట్: జిల్లాకేంద్రంలోని కొత్త అగ్రహారంలో గౌరీశంకర్ అనే వ్యక్తి లైసెన్స్ లేకుండా సర్జికల్ మెటీరియల్ విక్రయిస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు సమాచారం రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేసి పట్టుకున్నారు. అతని వద్ద రూ.3 లక్షల విలువల చేసే సర్జికల్ మెటీరియల్‌ను సీజ్ చేశారు. అనంతరం కోర్టులో కేసు ఫైల్ చేశారు.

☛ తెర్లాం మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు సమాచారం అందగా తక్షణమే స్పందించి తనిఖీ చేసి పట్టుకుని రూ.30 వేలు విలువ చేసే మందులు సీజ్‌చేసి కోర్టులో కేసు నమోదు చేశారు.

ఇలా ఐదుగురిపై కోర్టులో కేసులు నమోదయ్యాయి. లైసెన్స్ తీసుకుంటే పన్నుచెల్లించాల్సి వస్తుందని తెలిసిన షాపుల నిర్వాహకులు కొంతమంది, దాన్ని ఎగ్గొట్టేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. లైసెన్స్ లేకుండానే మందులు విక్రయించేస్తున్న క్రమంలో పాపం పండి దొరికి పోతున్నారు.

లైసెన్స్ లేకుండా మందుల విక్రయంతో రోగులకు నష్టం

లైసెన్స్ లేని వ్యక్తుల దగ్గర మందులు, సర్జికల్ మెటీరియల్స్ కొనుగోలు చేయడం వల్ల రోగులు నష్టపోవాల్సిన పరిస్థితి. నాణ్యతలేని, కాలపరిమితి



సర్జికల్ మెటీరియల్

దాటిన మందులను వారు విక్రయించే ఆస్కారం ఉంది. వాటిని రోగులు వినియోగించడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదముంది. లైసెన్స్ లేకుండా మందులు విక్రయించడం వల్ల ఎటువంటి బిల్లు ఇవ్వరు. దీనివల్ల మందుల షాపు నిర్వాహకులపై కోర్టులో గానీ మరెక్కడైనా కానీ పోరాటం చేయడానికి అవకాశం ఉండదు.

మందుల దుకాణాలకు నోటీసులు

జిల్లాలో ఉన్న మందుల దుకాణాలను ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు పాటించని షాపులకు నోటీసులు జారీ చేస్తున్నారు. జిల్లాలో 1200 మందుల దుకాణాలు ఉండగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జిల్లాలో 1012 దుకాణాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన

లైసెన్స్ లేకపోతే నేరం

లైసెన్స్ లేకుండా మందులు విక్రయించడం నేరం. ఇలా విక్రయిస్తున్న వారిలో ముగ్గురికి ఇదివరకే జైలు శిక్ష కూడా పడింది. మందులు, సర్జికల్ మెటీరియల్ లైసెన్స్ లేకుండా విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. కోర్టులో కేసులు పెడతాం. లైసెన్స్ కలిగిన మందుల దుకాణాలపై కూడా తనిఖీ నిర్వహిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోనున్నాం.

– కె. రజిత, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

237 మందుల దుకాణాలకు నోటీసులు జారీ చేశారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా మందుల దుకాణాలు నిర్వహించే వారిపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాలపరిమితి దాటిన మందులు విక్రయించడం, లైసెన్స్ లేకుండా మందుల షాపు, రికార్డులు నిర్వహించకపోవడం, నాణ్యత లేని మందులు విక్రయించడం వంటి వాటిపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

'కాంట్రాక్ట్' నర్సులను రెగ్యులర్ చేయాలి



ధర్నా చేస్తున్న నర్సులు

- సంఘం నాయకురాలు ప్రశాంతి

విజయనగరం ఫోర్ట్: కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే నర్సులందరినీ రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నర్సుల సంఘం నాయకురాలు ప్రశాంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 115ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యారోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్‌హెచ్‌ఎం విభాగాల్లో 13 నుంచి 15 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారందరినీ రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు వారికి రెండేళ్లు శిక్షణ ఇచ్చి రెగ్యులర్ చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రాణాలను పణంగా పెట్టి కోవిడ్ సమయంలో నర్సులు సేవలు అందించారని గుర్తు చేశారు. తమ సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ లను కలిసి వినతి పత్రం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం .ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గతంలో మంజూరైన పనులు చేస్తారా?



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

- మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సాలూరు నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనులు పూర్తిచేస్తారా? లేక అడ్డుకుంటారా అన్ని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 1200 కోట్లతో బ్రిడ్జిలు, రోడ్లు తమ ప్రభుత్వం హయాంలో పూర్తిచేశామన్నారు. అయితే ఇంకా పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపనలు కూడా పూర్తి చేశామన్నారు. ఆ పనులన్నీ పూర్తిచేయాల్సిన బాధ్యత ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉందని, తొందరగా పనులు చేస్తే రెండేళ్లలో పూర్తి కావస్తాయన్నారు. మంజూరు చేసిన పనులు పూర్తిచేయగలిగితే నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని, అవసరమైతే తన సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. సమావేశంలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్టాపు ముత్యాల నాయుడు, పి.వీర నాయుడు, పెద్దిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాలో ఇబ్బంది కల్పించవద్దు

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: ఉచిత ఇసుక సరఫరాలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా లారీ యాజమానులు చూడాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. ఈ మేరకు లారీ యాజమానులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకరించనుందని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లారీ యాజమానులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇసుక కోసం కూడా వినియోగదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఇంతవరకు 87 వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం బొబ్బిలి వద్ద 37 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, అక్టోబర్‌లో మరో రెండు స్టాక్ ప్లాయింట్లలో 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి రాబోతున్నట్లు తెలిపారు. లారీలు ఇసుక కోసం గంటల తరబడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ఎదురు చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోగానే ట్యాగ్ చేసిన వాహనదారుని మొబైల్ నంబర్‌కు టైమ్, స్లాట్ కేటాయిస్తారన్నారు. అదేవిధంగా తెలుగులో ఎప్పటికప్పుడు మెసేజ్ అలర్ట్స్ కూడా వస్తాయని చెప్పారు. లారీ కెపాసిటీని బట్టి ధర నిర్ణయించనున్నామని, కొత్త విధానాలు అమలు చేసేటప్పుడు ఇబ్బందులు ఉంటాయని, లారీ యాజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో మైన్స్ డీడీ పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150 సంవత్సరాల వేడుక

విజయనగరం టౌన్: స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్కన ఉన్న సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150వ వసంతంలోకి అడుగుపెట్టబోతున్న సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘమిత్ర ఆర్ ఎస్.జాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రెవరెండ్ డాక్టర్ వై.ప్రభాకర్ దైవ సందేశాన్ని అందిస్తారని, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. కేక్ కటింగ్‌ను కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చేస్తారని తెలిపారు. క్రైస్తవ సోదరులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కొట్టుకుపోయిన కాజ్‌వే

బొబ్బిలి రూరల్: రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పారాది గ్రామం వద్ద నిర్మించిన తాత్కాలిక కాజ్‌వే వరదనీటిలో కొట్టుకుపోయింది. శనివారం నుంచి ఎగువ ప్రాంతాలైన పాచిపెంట, సాలూరు, ఒడిశాలో పెద్ద ఎత్తున వర్షాలు కురవడంతో ఆ వరద నీరంతా వేగావతిలో చేరి ప్రవహించడంతో ఒక్కసారిగా వచ్చిన భారీ వరదకు తాత్కాలిక బ్రిడ్జి కొట్టుకుపోయింది. మొన్నటి వరకు కొంత మేర దెబ్బతిన్నా కాస్త మరమ్మతులు చేసి వాహనాల రాకపోకలు సాగించేవారు. ప్రస్తుత వర్షాలకు ఆ కాజ్‌వే పూర్తిగా కొట్టుకు పోవడంతో కొత్తగా కాజ్‌వే నిర్మించాల్సి ఉంది. వర్షాలు పూర్తిస్థాయిలో తగ్గితే కొత్త బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, అంతవరకు పాతబ్రిడ్జిపైనే 10 టన్నుల బరువున్న వాహనాలను అనమతిస్తామని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కాజ్‌వే కొట్టుకుపోయిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అలాగే ఈ వర్షాల ప్రభావంతో మండలంలోని గోపాలరాయుడు పేట, నారశింహుని పేట, సీతయ్యపేట గ్రామాల్లో నానిపోయిన ఇంటిగోడలు కూలిపోయిన సమయంలో ఆ ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. బాధితులకు స్థానిక సచివాలయాల్లో తాత్కాలిక బస ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



కొట్టుకుపోయిన పారాది కాజ్‌వే

86శాతం అధిక వర్షపాతం



కంట్రోల్ రూమ్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 86శాతం అధికంగా వర్షపాతం నమోదైందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయని అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించారని ప్రశంసించారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు గ్రామ, మండల స్థాయి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతుకు ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు వేసి పంపించాలని ఆదేశించారు. తాగునీరు, కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని కోరారు. వర్షాలకు ఇళ్లు దెబ్బతిని పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి వారి ఇళ్లలో ఉన్న వస్తువులకు నష్టపరిహారం అందించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో గ్రామస్తులను భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ వై. సత్యంనాయుడు, డ్వామా పీడీ కె. రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'కంట్రోల్ రూమ్ పరిశీలన

తుఫాన్ దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేసేందుకు, ప్రజల నుంచి సమస్యలను తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ రికార్డును పరిశీలించారు.

తోణాంలో జ్వరాల తీవ్రత

సాలూరు రూరల్: మండలంలోని తోణాం గ్రామంలో జ్వర పీడితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. కొద్దిరోజులుగా జ్వరాలతో పలువురు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో చేరి వైద్య సేవలు పొందుతున్నప్పటికీ రెండు రోజులుగా బాధితులు పెరిగిపోతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం దాదాపు గ్రామంలోని ప్రతి ఇంటిలోనూ జ్వరపీడితులు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



జ్వరంతో బాధపడుతున్న గంగారావు



జ్వరం బారిన పడిన ఉష

రక్త హీనతతో యువకుడి మృతి



సూరజ్ (ఫైల్)

భామిని: మండలంలోని పెద్దదిమిలి గ్రామానికి చెందిన యువకుడు పాలక సూరజ్(25) తలసేమియాతో బాధపడుతుండడంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతూ సోమవారం మృత్యువాత పడ్డాడు. సూరజ్ తలసేమియాతో బాధపడుతూ రెండు నెలలకు ఒకసారి రక్తమార్పిడి చేసుకుంటున్నాడు. ప్రభుత్వం నుంచి నెలవారీ రూ.10 వేల పింఛన్ కూడా అందుకుంటున్నాడని మృతుడి కుటుంబసభ్యులు విలపిస్తూ తెలిపారు. సూరజ్‌లో పచ్చకామెర్ల లక్షణాలు బయట పడడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయిస్తుండగా ప్రాణాలు పోయాయని వాపోయారు. మృతుడి తండ్రి రామారావు ఎనిమిది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భర్త, కొడుకుల మృతితో ఆ ఇంటి ఇల్లాలు రూపవతి అనాథగా మారిందని స్థానికులు తెలిపారు.

గిరిజనుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



పెదఖేర్జీల గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్మోహనరావు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.జగన్మోహనరావు

కొమరాడ: మారుమూల గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని సర్వపాడు, చినఖేర్జీల, కె.కొత్తవలస, పెదఖేర్జీల గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల ప్రభావం, ప్రజల ఆరోగ్యం వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను తనిఖీ చేశారు. ఏ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి, వారికి అందించిన చికిత్స, తదితర వివరాలను పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. వెల్‌నెస్ కేంద్రం వద్ద ఉన్న ఫీడర్ అంబులెన్స్‌ను పరిశీలించి ఈ వారంలో అందించిన సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను వివరించారు. పెదఖేర్జీలలోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ తదితరులున్నారు.

గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు

- ఎస్పీ వకుల్‌జిందాల్

గంట్యాడ: జిల్లాలో గంజాయి రవాణా, విక్రయం, వినియోగం నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన గంట్యాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ ప్రాంగణాన్ని, పోలీసు బిల్డింగ్ గదులు, ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న వాహనాలను పరిశీలించి అయా వాహనాలు ఏ కేసుకు సంబంధించినవో తెలిసే విధంగా లేబుల్స్‌ను ఏర్పాటు చేయాలని, రికార్డు మెయింటెయిన్ చేయాలని అధికారులను ఆదేశించారు. సీడీ ఫైల్స్, స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లో క్రైమ్ చార్ట్ పరిశీలించి, పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి ప్రమాదాలు ఎక్కడ ఎక్కువ జరుగుతున్నది, బ్లాక్ స్పాట్స్ ఎక్కడ ఉన్నది ఎస్సై సాయి కృష్ణను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు గంట్యాడ పోలీసులు చేపడుతున్న చర్యలపై ప్రశ్నించారు. రాత్రి గస్తీ సమయాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల వేలిముద్రలను మొబైల్ పింగర్ ప్రింట్ చెక్ డివైజ్‌తో తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ కేకేవీ విజయనాథ్, ఎస్సై సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190